కథానిక

# యాత్రికుడి సమస్య

పి. వి. పల్లి

చంద్రశేఖరరావు పూర్తిగా మారిపోయాడు. సంవత్సరం-రెండు సంవత్సరాల క్రిందట ఓ పిల్లజమీందారు హోదాలో వున్న మనిషి నేడు అదోలా తయారయ్యాడు. అయితే తెల్లని ఇస్త్రీ చేసిన బట్టలు వేసుకుంటాడు. ఆనాటి సిల్కు బట్టలు, కేప్‌స్టన్ సిగరెట్లు, బంగారపు గొలుసుతో ఉన్న వాచీ-యిల్లాంటివేమీ యిప్పుడు అగుపడవు. మనిషిలో అదోవిధమైన మార్పు కూడా వచ్చింది. ముఖంలో ప్రశాంతం గోచరిస్తుంది. రోడ్డుమీంచి పోతూంటే "మహారాజు—అమాయకుడు" అనాలనిపిస్తుంది.

పట్నం వొదిలి పల్లె చేరుకున్నాడు. ఇక పట్నంలో వున్నందువల్ల అతనికేమీ లాభమనిపించలేదు. "ఉన్నదంతా వూడిపోవడం తప్ప మరోటిలేదు" అని అమ్మ మందలించింది కూడా. కాకపోయినా "నిక్షేపంలాంటి కరణీకం వదలుకుని, నాకాయినూకాయి వుద్యోగాలకు తిరగడం వద్ద"ని వాళ్ళ పెద్దన్నయ్య యెన్నోసార్లు చెప్పాడు. "మనకున్నదాంతో సరిపుచ్చుకోగూడదుటండీ-ప్రజల్ని ఎందుకు హింసపెట్టడం" అని శతపోరింది భార్య సీతాలక్ష్మి. మామగారు కూడా చెవినిల్లు కట్టుకుని యెంతగానో చెప్పారు, పల్లె వదిలిపోవద్దని. అప్పటి అతని మనస్తత్వం ధనంమీద మొగ్గింది. అందుకే పట్నపు ఉద్యోగంచేసి కాస్తోకూస్తో వెనకేసుకుందామనీ, ఆ సొమ్ములో దమ్మిడీకూడా తనవాళ్ళ కెవ్వళ్ళకీ యివ్వకుండా, తనూ తనభార్యా, తన ఒక్క కొడుకూ అనుభవించెయ్యాలనీ అన్నయ్యపేర కరిణీకం ట్రాన్స్‌ఫరుచేశాడు. అయితే, యితను మూడోవాడైనా, స్కూలుఫైనలు లనిపించుకున్నందునా, యింటిపట్టున వుంటాడనే వుద్దేశంతోనూ, వ్యవసాయపు పనుల్లో తనకి చేదోడు వాదోడుగా వుంటాడనీ, యింతకీ తనకి సంతకం పాటి చదువుతప్ప అధికం రాదుకనుకనూ, చంద్రశేఖరరావుకి, తండ్రి తదనంతరం తనకి రావలసిన కరిణీకాన్ని వప్పచెప్పాడు. రెండోవాడు బి. ఏ. పాసై-బి. యిడి. అయి, హైస్కూల్లో మేస్టరీ చేస్తున్నాడు. "అనుభవం అయిపోయింది పట్నం కాపురం" అంటూ వచ్చి, మళ్లీ తన కరిణీకం తనకిచ్చెయ్యమని అమ్మద్వారా రాయబారం సలిపాడు, అన్నయ్యతో. అతను కాదనలేదు. వెంటనే ఛార్జీ యిచ్చేశాడు.

కరిణీకం చేస్తున్నాడన్న మాటేగాని, యేమీ సంతృప్తిలేకుండావుంది. చేతినిండాలేదు రొక్కం. యేనాడో, యెవరో, యేదేనా పనిచెప్పి చేయించుకుని, పదో పాతికో యిస్తే అదీ—నెల నెలా వచ్చే యిరవైరూపాయలూ తప్ప మరో విధమయిన రాబడిలేదు. పట్నంలో వుద్యోగం చేస్తున్నప్పుడు, వద్దంటూండగానే పాతికలూ, యాభయిలూ ప్రతిదినం వచ్చిపడుతూండేవి.

ఓనాడు సాయింకాలం, పొలం గట్టుమీద కూచుని, యెండిపోయిన పొలాలవేపు చూస్తూ ఆలోచనల్లోపడ్డాడు. వెనకనుండి, పాలేరువచ్చి తనముందు కూచుని గడ్డితవ్వుతూ అన్నాడు.

"యేసవికాలం బాబూ—గడ్డికూడా సరిగా లేదు. పైరుకాలంలో అయితే యెంతో పచ్చగా వుంటాయి పొలాలు. అప్పుడు చూస్తే యెంతో ఆనందంగుంటాది."

చంద్రశేఖరం మాట్లాడలేదు. అలా చూస్తూ, సిగరెట్టుపొగ వొదుల్తూ—మళ్లీ పీలుస్తూ, మళ్ళీ వొదుల్తూ...వుండిపోయాడు. పాలేరు మాటలు పట్టించుకోలేదు. పాలేరు వెళ్ళిపోయాడు.

చంద్రశేఖరానికి వెనకటిరోజులు గుర్తుకొచ్చాయి. తను ఎఫ్. ఎస్. ఓ.గా పనిలో ప్రవేశించాడు. ఊళ్ళంబడి ప్రొక్యూరుమెంటుకు వెళుతూండేవాడు. గ్రామ కరణం యింట్లోనో, మునసబు యింట్లోనో మకాంవేసేవాడు. లేకపోతే, ఆ వూళ్లోవున్న మోతుబరి భూస్వామి—అయినవాళ్ళ యింట్లో బసచేసేవాడు. తినగలన్ని తినుబండారాలు, అనుభవించవలసినన్ని అను

భవాలు-సిగరెట్టుకి లోటులేదు. ఇంతకీ ఏ కోరిక తనుకోరితే ఆ కోరిక వెంటనే సిద్ధించేది. తన చుట్టూ యెంతోమంది తిరిగేవారు. భూస్వాములు చేతులు జోడించుకుని తనముందు నిలబడేవారు. అప్పుడు తను ఓ చక్రవర్తి. వాళ్లందరూ తనదగ్గర పరిచారకులు. తను పాలకుడు. వాళ్ళందరూ పాలితులు. ప్రభుత్వంవారు యిచ్చే అరవై డెభై కాక-ఆరేడు వందల రూపాయలు సునాయాసంగా చేతికొచ్చేవి. దారంతట పోతున్న బండినాపి, "ఏయ్-జాగ్రత్త..." అని గద్దించి—జేబునిండగానే తనదారిన తను పోతూండేవాడు. ఆ బండివాడు, ధాన్యంగలవాడూ, యేదో అంటూంటే, వినీవినిపించుకోనట్లు హుందాగా నడిచిపోతూంటే, వెనకాల వస్తున్నవాళ్ళంతా—"చిత్తం! తమరుగాబట్టి అలా విడిచిపెట్టారుగాని..."అంటూంటే తను, ఒళ్ళు పులకరించి, మరీ హుందాతనంగా నడుస్తూండేవాడు. ఓ మాటు ఓ వూరి మునసబునే పట్టుకున్నాడు. వాడికి మహాపొగరుగావుండేది. లేకపోతే తనని ఎదిరిస్తాడా? లంచం తీసుకున్నట్లు నలుగురు అధికార్లకీ తెలియబరుస్తాడా? వాళ్ళు మాత్రం తనని ఏంచెయ్యగలిగారు? తనూవాళ్ళూ ఒకటేగా?—అందుకే ఆవేళ మునసబుతాలూకు రెండుపుట్లు ధాన్యం (40 కుంచాలు) మిల్లుకు పోతూంటే, బండినాపి, మునసబుమీద కేసు పెట్టించాడు. ఓసారి, యింకోవూరి మోతుబరి రైతు, తనతాలూకువాళ్ళందరూ పోలీసు వుద్యోగాల్లోనూ, కలక్టరేట్‌లోనూ—యింకా యితర ప్రముఖ డిపార్టుమెంటుల్లోనూ వున్నారనీ, తనని జాగ్రత్తగా వుండమనీ బెదిరించుతే, అతని యింట్లోవున్న ఆరుగరిసెల ధాన్యాన్నీ ప్రొక్యూరు చేశాడు. మళ్ళీ ఆ మోతుబరి ఆసామీ కొడుకు బ్రతిమాలుకుంటే మూడు పులిబుర్ర కాగితాల్ని జేబులోవేసుకుని, కళ్లుమూసుక్కూచున్నాడు. ఆ రెండుమూడు సంవత్సరాల్లోనూ ఎంత సొమ్ము ఆర్జించాడో తనకే తెలీదు. ఎంతకర్చుపెట్టాడో తనకి గుర్తులేదు.

సీతారామయ్యా నలగిరీ షాపులో రెండువేల రూపాయలకిపైగా నగలు కొన్నట్టు జ్ఞాపకం. ప్రక్కవీధి మంజువాణికి. ఆరువందలదాకాయిచ్చినట్లు గుర్తుంది. తన ట్వీడ్ సూట్లకీ, యింకా సిల్కు బట్టలకీ—వెంకన్నగారి బట్టల షాపులో ఖర్చుపెట్టినది రెండువేలుదాకా వుండొచ్చు. అధమం ఆరేడుసార్లన్నా చెన్నపట్నం, రెండుసార్లు ఢిల్లీ, మూడుసార్లు బొంబాయి, ఒకసారి కలకత్తా, అక్కణ్ణించి కాశీ, ఇలాంటి పట్టణాలూ పుణ్యక్షేత్రాలూ తిరిగివచ్చినట్లు జ్ఞాపకం. విమానంలో తనూ తనభార్యా, తనూ తనమంజువాణీ, ఎగురుతూంటే, అబ్బ! అనోక స్వర్గవిహారం—! అంచనా వేశాడు ఓరోజున. అంటే కంట్రోలు తీసివేస్తారని పుకారుపుట్టినప్పుడు, మూడు సంవత్సరాలు ఆరునెలలోనూ తను గడించింది...వేలమీదనేపోయిందిగాని, సరిగ్గా అంచనా దొరకలేదు. కుటుంబ ఖర్చుకి కోటాదార్లు యిచ్చే మామూలు సరిపోగా, యింకా వందా, రెండు వందరూ మిగిలేవికూడాను. అసలు, తను యేవూరు వెళ్లాలన్నా, ఓ భూస్వామి—లేకపోతే పెద్ద కోటాదారు, ఇలాంటి ఘరానా మనుషుల్ని వెనకేసుకు వెళ్ళేవాడు; కనుకనే తనకి అట్టే ఖర్చుండేదికాదు. సేవింగ్సు బ్యాంకులో వేస్తే యేనాడన్నా ప్రభుత్వం కళ్లుతెరచి "నీకింతడబ్బు యెక్కణ్ణుంచి వచ్చింద"ని 'అడుగుతారే'మోనని భయపడ్డాడు. మేడకొందామంటే, అదీ చిక్కే. పోనీ తన భార్యపేర వ్రాయిద్దామని ఉబలాటపడ్డాడు. పేరుపడ్డ ప్లీడరు యిచ్చిన సలహావల్ల వూరుకున్నాడు మళ్ళీ. అంచేత ఏమీ మిగల్చకుండా, చక్రవర్తి హోదాలో రోజులు గడిపాడు.

పెద్దన్నయ్య. రెండువందలు తనకూతురి పెళ్లికని యిమ్మంటే, తను యివ్వలేదు. అయినా ఎవరంతటవాళ్ళు వాళ్ళు. యెందుకివ్వాలన్నాడు. భార్య యిమ్మన్నది. అయినా, అనుభవశూన్యురాలు. తనకేం తెల్సు అనుకున్నాడు. అమ్మవచ్చి "నాయినా చెల్లి పెళ్లిమాట యేమిట్రా"అంటే—"పెద్దాయన వున్నారుగా, కరిణీకం చేస్తున్నాడు. యీ రోజుల్లో వాళ్ళు తినగా మిగిలిందే మాకు వస్తుంది"అని కోప్పడ్డాడు కూడాను.

ఉద్యోగంపోయి సంవత్సరందాటింది. ఎలాగో యీ కొంతకాలం గడిపాడు. అయినా తన సరదాలు యేదోవిధంగా తీర్చుకున్నాడు; యింతకీ ఆ డబ్బు దమ్మిడీకూడా అవుపించడంలేదేం?—తనభార్య మెడలోవున్న పుస్తెలతాడూ, కాళ్ళకి

వున్న పట్టీలు, ముక్కునివున్న బేసరీ—యివన్నీ పెళ్లినాడు వున్నవే. తను సంపాదించినవి కావు. తన చేతికివున్న రిస్టువాచీమాత్రం తను వుద్యోగములో వున్నప్పుడు కొనుక్కున్నది. అసలు—అప్పటి మనుషులు, కనిపిస్తే, పలకరించనే పలకరించరు. ఆ గ్రామకరణాలూ, మునసబులూ, కోటాదార్లూ, భూస్వాములూ, యింకా అనేక మంది, తనకి కనబడుతూనే వుంటారు. గాని—"ఏమంటోయ్"అని పలకరించనే పలకరించరు. వెధవలు! విశ్వాస ఘాతకులు! అనుకున్నాడు.

ఆ బంట్రోతు వెధవకి ఎంతపొగరు-అప్పుడు "బాబూ కేంపులకి నన్ను తీసుకెళ్ళడం మానేస్తున్నారు. నన్నుకూడా తీసుకువెళ్ళండి బాబూ" అని మొరపెట్టుకుంటే, తనవెంట తీసుకుపోయి పదీ పదిహేనూ యిప్పించేవాడు అందరిచేతాను. అలాంటి వెధవ ఆవేళ పట్నంలో అవుపించి చూసీ చూడనట్లు తప్పించుకుపోతాడా? ఆ మంజువాణి మాత్రం తననిచూచి తలుపువేసుకుంటుంది. ఏం ఆ మునసబుగాడికన్న తనేం తక్కువ? వాణ్ణి రానివ్వడమూ, తననిచూచి తలుపు వేసుకోవడమూనా? —

బాగా చీకటి పడిపోయింది. సిగరెట్టుపారేసి యింటిముఖం పట్టాడు. నడుస్తున్నాడు. అయినా అడుగులు పడటంలేదు. సరిగా తన వుద్యోగకాలంలో యేనాడూ అడుగు కిందకు పెట్టలేదు. ఈనాడు ముళ్ళదారంబడి నడవటమా? సైకిలుండేది; రాలీసైకిలు, నాలుగువంద రూపాయిలు పెట్టి సెంట్రలు కోటాదారు కొనియిచ్చాడు. వెధవలు యీవూరు వచ్చాక యెవడో కొట్టేశాడు. పోలీసులకి అప్పచెప్పితే వాళ్ళ కాఫీలకీ యితరాలకీ చాలా ఖర్చయింది. గాని తన సైకిలు రాలేదు. అలాగే యిల్లు చేరుకున్నాడు. పిల్లాడు యేడుస్తున్నాడు. చికాకనిసించింది తనకి.

"ఏయ్—వినపడలేదా పిల్లాడి యేడుపు?" కేకవేశాడు. భార్యవచ్చి తీసుకుంది ఉయ్యాలలోంచి పిల్లాణ్ణి.

"నాయనా పిల్లడికి ఒంట్లో యేమీ బాగులేదు. రేపు వైద్యుణ్ణి తీసుకురా" అన్నది ముసలి తల్లి.

తనదగ్గిర దమ్మిడీకూడా లేదాయెను. కోపం వచ్చింది. "వెధవసంతానం, గట్టిగా వుండక యీ రోగాలుకూడాను" గొణుక్కుంటూ వీధి అరుగు మీదకిపోయి కూచున్నాడు.

"ఇంకా వంటకాలేదా?" కేకవేశాడు. ఆ కేకవిని తల్లివచ్చి "రా నాయనా" అని పిలిచి తీసుకెళ్ళింది.

రాత్రి సరిగా నిద్రపట్టలేదు చంద్రశేఖరానికి. ఏదోవిధంగా కానీ పరకా సంపాయించాలి. ముప్ఫయియేళ్లు నెత్తికొచ్చాయి. ఇప్పటికైనా తను ప్రయోజకుడు కావాలి. "ఏం యింతకు ముందు అ ప్ర యో జ కు డ నా? వేలకువేలు తెచ్చానే?" తనలో తనే ప్రశ్నించుకున్నాడు. "కాలం మారింద"ని తనలో తనే సముదాయించుకున్నాడు మళ్ళీ. అయితే యెలా సంపాయించడం? ఏమీ పాలుపోలేదు. వూళ్ళో తనని యెవరూ చూడరు. అన్న ఉదారస్వభావుడు కనక వదినె వద్దంటున్నా కరిణీకం మళ్ళీ యిచ్చాడు. వదినె, అన్నయ్యని తనతో కలిసి వుండనిచ్చింది కాదు. తనూ అన్నయ్యా వేరు వేరుగా వున్నారు. చిన్న అన్నయ్య వూసేలేదు. ఎక్కడనో మేష్టరీ చేస్తున్నాడు. వాడి పొట్టకి గడవటమే కష్టంగా వున్నది. పెద్దన్నయ్యని చూచినట్టుగా తనని యెవరూ చూడటంలేదు.

వెంకయ్యనాయుడు తను వెళితే, కుర్చీ దిగనే దిగడు. అన్నయ్యని చూడగానే లేచి నమస్కరించి "దయచేయండి బాబూ" అంటాడు. ఒకరేమిటి అందరూ అంతే. వీళ్ళందర్నీ ఎలాగన్నా తన చేతిలోకి తీసుకోవాలనుకున్నాడు. ఎలాగా? అని సమస్య బయలుదేరింది. ఇక ప్రతిదినం—తలయారిని వెనకరమ్మని ప్రతివీధీ తిరగడం. ఎక్కడ చెత్తవున్నా ఆ యింటివాళ్ళని పిలవడం బెదిరించడం. అలా ఐతే యేమైనా పడుతుంది చేతిలో. ఇంకా యీ ఉపకారంచేస్తా ఆ ఉపకారంచేస్తా అని ఏమన్నా లాగాలి. అయినా అన్నయ్యకయితే నమ్మకంమీద యిస్తారుగాని, తనకివ్వరు. ముందు పనిచేసి చూపించాలంటారు.

తనకి యేమీ తోచలేదు. ఇక ఆ వుద్యోగానికి తిలోదకాలిచ్చేస్తే మంచి దనుకున్నాడు. అయినా మళ్ళీ ఆలోచించడం మొదలుపెట్టాడు. ఈ కరిణీకంపోతే లాభంలేదు. ఇదికూడా వుండదు ఆఖరికి—

ఎలాగో బలవంతంగా కళ్లుమూశాడు ఆరాత్రి.

ప్రతిదినం ఏదోఒకటి ఆలోచించడం దాని నుండి విరమించుకోవడం పరిపాటి ఐపోయింది.

ఓ వాడు పొద్దున్న వెంకయ్యనాయుడు కుటుంబసహితంగా తిరపతి యాత్రకి బయలుదేరి చంద్రశేఖరంతోటీ, అతని అన్నయ్యతోటీ అమ్మతోటీ చెప్పడానికి వచ్చాడు. అన్నయ్య అల్లంతదూరందాకా సాగనంపేడు వాళ్లనందర్నీ. ఇక తనుగూడా తిరుపతి యాత్ర పోయివస్తే మంచిదనీ, తనకొడుకు ఆరోగ్యం బాగుపడుతుందేమోననీ అమ్మతో సలహా చేశాడు.

"అలాగే నాయనా నేనుగూడా వస్తాను. యేనాడో చిన్నప్పుడు మానాన్నతో వెళ్లాను." అన్నదితల్లి. కొంచెం కష్టం అనిపించింది చంద్రశేఖరానికి. అయినా సహించి "అలాగే" అన్నాడు.

"అయితే డబ్బుండొద్దా?" అడిగేడు.

"నాయినా— అప్పుడు మేం వెళ్ళినప్పుడు, యేడు యిళ్ళల్లో ముష్టియెత్తి ఆ డబ్బుతో వెళ్లి వచ్చాం" అన్నది.

"ఛీ. ఛీ. ముష్టేమిటమ్మా......" ఏవగించుకున్నాడు.

"అది ముష్టి అనిపించుకోదు నాయనా. అసలు పెద్దపెద్ద వాళ్లుగూడా యిలాగే ముష్టి యెత్తి ఆ డబ్బును తమ డబ్బుతో కలిపి వెళతారు."

"అయితే యెంత దొరుకుతుంది?"

"యెంతో ఒకంత."

"సరే..." అన్నాడు.

మర్నాటినుండీ ముష్టి యెత్తడం ప్రారంభించారు తల్లీకొడుకూను. ఊళ్ళో అయితే తల్లివచ్చేది వెనక. చంద్రశేఖరం మూడురోజులు తిరిగాడు. కొందరు అనుమానపడి వాళ్ళన్నయ్య వెంకట్రావుని అడిగేరు.

"అవును. వాళ్లు తిరపతి వెళతారు" అని అందరితోటీ చెప్పాడతను.

యెల్లాగయితేనేం పదిహేను దినాలు కష్టపడి రెండువందల యాభైయారు రూపాయలు సంపాదించాడు చంద్రదేఖరం.

"మంచి ముహూర్తంచూచి బయలుదేరాలి" అన్నది తల్లి.

"అలాగే" అన్నాడు చంద్రశేఖరం.

అప్పుడే రెండు నెలలు గడిచినా, మాట్లాడలేదు చంద్రశేఖరం.

"యెప్పటికీ 'తిరుపతియాత్ర' చెయ్యరేం?" అని అందరూ అడగడం మొదలుపెట్టేరు వెంకట్రావుని. వెంకట్రావు మారుమాటాడలేక పోయినాడు. ఏవో సాకులు చెప్పుతూ వచ్చాడు. అయినా యెవరు నమ్ముతారు?

# డిటెక్టివ్ కథ

చలి తీవ్రంగావున్న ఒకరోజు వుదయం గ్రాడ్ మన్ అనే అతని యింటిముందరి గంటెవరో దీర్ఘంగా మోగించారు. గ్రాడ్ మన్ యింగ్లండులోని సి. ఐ. డి. పోలీసుశాఖ "స్కాట్లండ్ యార్డ్"లో డిటెక్టివ్ వుద్యోగంచేసి రిటైరైనాడు. తను రిటైరైననాటినుండి ఆ పోలీసుశాఖ ఏమీ బాగులేదని అతని వుద్దేశ్యం. అతను బాగా అమ్ముడుబోయిన "నే పట్టుకున్న నేరస్తులు"అనే పుస్తకంకూడా ఒకటివ్రాశాడు.

గంట మోగగానే రెండో అంతస్తులోని ఒక గది కిటికీ తెరువబడి అందులోంచి ఆ మాజీ పోలీసు వుద్యోగస్తుడు కోపంతో మండుతున్న కండ్లతో కిందకుచూచాడు. కింద ఒక ముదుసలిది యేడుస్తూ నిలుచునివుంది. ఆమెపేరు మిసెస్ డ్రాబ్ డంప్. ఆ యింటి యెదురుగావున్న వసతి గృహం యజమానురాలు.

"మిస్టర్ గ్రాడ్ మన్, దయచేసి మాయింటికి రండి. మిస్టర్ కాన్ స్టంట్ చనిపోయాడు"అన్నది.

నిద్ర చెరిపినందుకా మాజీ డిటెక్టివ్ కోపగించుకున్నాడు; తనవల్లేమీ ప్రయోజనముంటదు; ఒక డాక్టర్నైనా, లేక శవాల్ని పాతేవాళ్లనైనా పిలిస్తే...

ఆఖరుకు మిసెస్ డ్రాబ్ డంప్ కోరిక కంగీకరించి వెంటనే క్రిందికొస్తానన్నాడు. కృతజ్ఞ